# పెట్



**కొమ్మూరి వేణుగోపాలరావు**

శ్రీపతికి మనుషులంటే మహా యిష్టం. కుక్కపిల్లలంటే గొప్ప అసహ్యం. మనుషులంటే గాఢాభిమానం. కుక్కపిల్లలంటే తెగని చికాకు. మనుషులంటే ఎంతో నమ్మకం. కుక్కపిల్లలంటే చచ్చే భయం.

చిన్నప్పుడు అతని బంధువులబ్బాయిని ఓ పిచ్చికుక్క కరిచింది. ఆ అబ్బాయికి వెంటనే దానికి విరుగుడు యింజక్షన్లు యిప్పించలేదు. నెల రోజుల తర్వాత ఆ అబ్బాయికి ఓ రకం రోగ మొచ్చింది. జ్వరమూ అలాంటి దేమీ వుండేది కాదు. విచిత్రంగా ప్రవర్తించే వాడు. మనుషుల్ని చూసి దూరంగా జరిగేవాడు. భయంగా చూసేవాడు. గది మూలల్లోకి, చీకట్లలోకి జారుకునే వాడు. మంచినీళ్ళిస్తే త్రాగలేకపోయే వాడు. డాక్టరుదగ్గరకు తీసుకెడితే, ఆయన కాసేపు తర్జనభర్జనపడి 'రేబిస్' అని పిచ్చికుక్క కరిస్తే వచ్చే వ్యాధని, తేల్చి దానికేమీ మందులేదు తీసుకు పొమ్మన్నాడు. ఆయన చెప్పినట్లుగానే ఆ కుర్రాడు ఒకటి రెండు రోజులలా బాధపడి, చివరకు కన్నుమూశాడు.

శ్రీపతి ఆ దృశ్యాలన్నీ వివరంగా చూశాడు. చిన్నతనంలో చూడటంచేత అవన్నీ గాఢంగా మనసులో నాటుకుపోయాయి.

అప్పట్నుంచీ కుక్కపిల్ల లంటే జుగుప్స. వాటిని పెంచేవాళ్ళన్నా చిరాకు పడేవాడు.

"కుక్కలున్నాయి జాగ్రత్త" అనే బోర్డువున్న యిళ్ళకి-వాళ్ళతో పనివున్నా కూడా వెళ్ళేవాడు కాదు.

అలాంటి శ్రీపతి కుక్కపిల్లని పెంచుతున్నాడంటే చోద్యమనిపించి చూడటానికి వెళ్ళాను.

చిన్న కుక్కపిల్ల వాకిట్లోనే చిన్న గొలుసుతో కట్టివేయబడివుంది. తెల్లగా, పొట్టిగా, గునగునలాడుతూ అందంగానే వుంది. వయసు ఒకటి రెండు నెలల కంటే మించి వుండదు. నన్ను చూడగానే మీదమీదకి వచ్చి ముందుకాళ్లతో పట్టుకుంటూ, నాలికతో తాకుతూ, ఒడిలోకి దూకటానికి ప్రయత్నిస్తూ నానా హంగామా చేస్తున్నది. దానితో కాసే పాడుకుని, తర్వాత గుమ్మంలో కెళ్ళి 'శ్రీపతీ!' అని పిలిచాను

లోపలనుండి వచ్చాడు. వస్తూనే "ప్యాంటుమీద ఆ మరకలేమిటి? దాన్ని ముట్టుకున్నావా? ఛీ. ఛీ. నీకసహ్యం వెయ్యలేదూ?" అని కేకలేశాడు.

అతని ధోరణిలో నాకేం మార్పు కనిపించలేదు. కొంచం తెల్లబోయినా, బయట పడకుండా, నవ్వటానికి ప్రయత్నిస్తూ "ఎప్పట్నుంచి పెంచుతున్నావేమిటి?" అనడిగాను.

"పెంచట మేమిటి నా మొహం. మా ఆఫీసరు కుక్కల పిచ్చాడు. అత నెక్కడ్నుంచో మోజుపడి యీ కుక్క పిల్లను తెచ్చుకున్నాడు. ఇంతలో ఆయనగారి భార్యామణి అర్జంటుగా పుట్టింటికి వెళ్లాల్సివచ్చిందిట. ఇంట్లో తను ఒక్కడూ వుంటాడు కాబట్టి - దీన్ని పెంచటం కష్టమట. అందుకని - దీని భారం నా కప్పజెప్పాడు."

"కుక్కపిల్లలంటే నీ కసహ్యమని చెప్పకపోయావా?"

"చెప్పటానికి ప్రయత్నించాను. నా మాట వినిపించుకుంటేగా. ఆయన ఆజ్ఞ నేను ధిక్కరిస్తున్నట్లు ఫ్రిజుడిన్ ఫీలయి - 'ఏమయినా సరే నువ్వీ పని చెయ్యాల్సిందే' అని హుకుం జారీ చేశాడు."

శ్రీపతి - లోపల అగ్ని పర్వతం దాచుకున్నంత ఉగ్రంగా కనిపించాడు.

"అంతేకాదు. రోజూ వస్తూవుంటాడు. దీనిపేరు వైట్ అని పెట్టుకున్నాడట. 'వైట్‌కి పాలుపోశావా?' అని వాకబు చేస్తాడు. 'నీళ్లు పోశావా?' అని ఆరాలు తీస్తాడు. అంతటితో సరిపెట్టకుండా ఆయన దగ్గరకు దీన్ని తిరిగి పంపించే లోపల షేక్‌హేండ్ యివ్వటం, బంతి విసిరితే నోటితో కరిచి తీసుకురావటం యిలాంటి ఆటలన్నిట్లో తర్ఫీదుచేసి మరీ వుంచాలట.'

శ్రీపతినిచూస్తే జాలేసింది - అతనికి బొత్తిగా యిష్టంలేని పనులు అంతరాత్మకు వ్యతిరేకంగా చేయవలసి వస్తున్నందుకు.

అతని భార్యకూడా రోగిష్టి మనిషి. గుండెజబ్బు అని చెప్పుకుంటారు. ఎంతో ఆంతరంగికంగా మాట్లాడేటప్పుడు శ్రీపతి అప్పుడప్పుడు లోపలి మనోవ్యధను అణిచిపెట్టుకోలేక ఆమె గుండెజబ్బు విషయం దాచిపెట్టి తనకి మోసంతో పెళ్ళిచెయ్యటం గురించి బయటపడిపోవటం నే నెరుగుదును.

పాపం ఆ అనారోగ్యపు మనిషి, లేని ఓపికతో భర్తతోపాటు యీ కుక్కపిల్లకు కూడా సేవలు చేయవలసి వచ్చినందుకు - నాకు బాధే కలిగింది.

కాసేపు అతను కసిగాచెప్పే కష్టాలు విని అక్కడ్నుంచి వచ్చేశాను.

* * *

పనుల వత్తిడివల్ల మరో మూడు నెలలదాకా శ్రీపతిని కలుసుకోవటానికి వీల్లేకపోయింది.

ఓ సాయంత్రం వీలుచూసుకుని వెళ్లేసరికి వైటీ వసారాలో గొలుసుతో కనిపించింది. చాలా బొద్దుగా, అందంగా పెరిగింది. ఆఫీసరుగారింకా తీసుకెళ్ళలేదా?

నన్ను గుర్తు పట్టినట్లు గొలుసుని గుంజుకుంటూ నా మీదమీదకు రావటానికి ప్రయత్నిస్తోంది.

అలికిడి విని శ్రీపతి బయటకు వచ్చాడు.

"ఇన్నాళ్ళకా కనబడటం?"

నా పనుల రాపిడి చెప్పాను.

లోపలి గదిలోకెళ్ళి యిద్దరం కూర్చున్నాక "మీ ఆఫీసరుగా రింకా కుక్కపిల్లను తీసుకెళ్ళలేదా?" అనడిగాను.

శ్రీపతి ముఖంలో అనేక భావాలు. కోపం, కసి, ఉద్రేకం, బాధ, నిస్సహాయత్వం - యిలాంటివి.

"ఆయన యిక్కడ్నుంచి ట్రాన్స్ఫరయి వెళ్ళిపోయాడు."

"మరి...?"

"చెబుతానుండు. వెళ్లేటప్పుడు నన్ను బుజ్జగించి "అక్కడింకా యిల్లు కుదరలేదనీ, కుదిరాక వచ్చి తీసుకెడతాననీ చెప్పాడు ఏమీ మాట్లాడలేకపోయాను. అక్కడికెళ్లాక ఎన్నాళ్ళకూ సమాచారం అందక పోయేసరికి విసుగుపుట్టి నేనే ఉత్తరం రాశాను. జవాబు రాశాడు - అక్కడ యింతకన్నా జాతి కుక్కపిల్ల యింకొకటి దొరికిందిట. అందుకని యిష్టమైతే దీన్ని వుంచుకోమనీ, లేకపోతే ఎవరికైనా యిచ్చివెయ్యమనీ...''

"మరి ఏం చేశావు."

"కనబడ్డ వాళ్లనల్లా అడిగాను. నా మొహంలో ఏముందో - నా వల్ల ఎన్నో ఉపకారాలు పొందినవాళ్ళు కూడా యీ చిన్న సహాయం నాకు చెయ్యలేకపోయారు. ఈడ్చుకువెళ్ళి ఊరిబయట వొదిలేసి వచ్చాను. నాకంటే ముందుగా ఎప్పుడు వచ్చేదో యింటి దగ్గర సిద్ధం. పోనీ నువ్వు తీసుకెడతావా?"

సంభాషణ యిలా వచ్చినందుకు యిరుకులో పడిపోయినట్లయాను. క్షమాపణ చెప్పుకున్నట్లుగా "మా మూడో అబ్బాయికి కుక్కపిల్ల లంటే భయం. అది వుంటే - ఆ చుట్టుపక్కలకి కూడా రాడు. మరి యీ స్థితిలో..."

నవ్వేశాడు. "నాకు తెలుసు-స్వల్ప సహాయం కూడా ఎవరివద్దా లభించదని..."

బాధనిపించింది. కాని యీ బాధ కుక్కపిల్లలని చూసి మా మూడో అబ్బాయి పడే - పెట్టే బాధ ముందు ఒక లెక్కలోది కాదు.

మాట మార్చాలని ''మీ మిసెస్‌కి ఎలావుంది?" అనడిగాను.

''హాస్పిటల్లో వుంది "

"ఆదేం?"

"నీకు తెలియని దేముంది? మళ్ళీ గుండెపోటు వచ్చింది. ఈసారి చాలా ఎక్కువగా వచ్చింది. బహుశా ఈసారి బ్రతకదేమో ననిపిస్తోంది."

అతని మాటల్లో నిర్లిప్తతకన్న యాంత్రికత ఎక్కువగా ధ్వనించి ఒక్క అరక్షణం చలించాను. కాని మానవ స్వభావాన్ని కొన్ని కొన్ని సందర్భాలలో తరచకూడదు; ముఖ్యంగా మనిషి ఓ విచిత్ర పరిస్థితిలో వున్నప్పుడు పెళ్లి జరిగాక యీ పదేళ్ల కాలంలో, ఆమె అనారోగ్యపు సహచర్యంలో అతని మనస్సు ఎన్ని అలజడులకు, పరిణామాలకు గురయిందో పైవాడి కెలా తెలుస్తుంది?

''ఇప్పుడు హాస్పిటల్‌కే బయల్దేరుతున్నాను."

"పద" అని నేనూ అనుసరించాను.

* * *

కొన్నాళ్లకు శ్రీపతి భార్య చనిపోయింది.

ఎదురుచూసేవే అయినా, తీవ్రమైనవి అయితే ఆ సంఘటనల ప్రాముఖ్యాన్ని ఎవరూ కాదనలేరు.

శ్రీపతి ఆకారంలో మార్పు వచ్చింది. వేషంలో నిర్లక్ష్యం. గడ్డం పెరిగింది. అతని కెందుకో యీ సమాజం మీద కసి పెరిగినట్లుగా నా కనిపించసాగింది.

ఏదో సంఘర్షణకు గురవుతున్న వాడిలా గోచరించేవాడు.

కాని నా కాశ్చర్యం కలిగించిన దేమిటంటే - యిదివరకు వైటీని చీదరించుకుని మాట్లాడేవాడు. ఈ మధ్య ధోరణి మారింది.

ఒకసారి "నేనే సరిగ్గా అన్నం వొండుకోవడం లేదు. దానికి ఏ రెండు మూడు రోజులకో ఓ ముద్ద పడేస్తున్నాను. అయినా నన్నొదిలి పోవటంలేదు. నేను దాన్నెంత తృణీకారంగా చూస్తున్నా - ఎంతో భక్తితో, ప్రేమతో, అప్యాయతతో నా కూడా కూడా తిరుగుతూ వుంటుంది. చాలా ఆశ్చర్యం. ప్రపంచంలో యింత విశ్వాసమైన జంతువు ఎలా సాధ్యమో" అన్నాడు.


"నీకో చిత్రం చెబుతాను. నా భార్య వల్ల నాకేం సుఖంలేదని తెలుసు కదా. ఇష్టమున్నా లేకపోయినా ఎక్కువగా త్యాగాన్నే ప్రదర్శిస్తూ వచ్చాను కదా. అయినా ఎన్నో సందర్భాలలో తన ప్రవర్తన ద్వారా ఎంత భయంకరంగా నా మనసుని బాధపెట్టేదో - నువ్వూహించలేవు."

ఊహించలేకపోవచ్చు కాని చెబితే అర్థం చేసుకోగలను. కాని సున్నితమైన కొన్ని విషయాల గురించి గ్రుచ్చి గ్రుచ్చి అడగటం నా మనస్తత్వంకాదు.

"నాన్నగారు పోయాక తమ్ముడ్ని నేనే పెంచి పెద్దవాడ్ని చేశాను. విద్యావంతుడ్ని చేశాను ప్రయోజకుడ్ని చేశాను. ఇవాళ్టి రోజున - ఆఖరికి నేను కష్టంలో వున్నప్పుడయినా యీ యింటి వైపు తొంగిచూడడు."

ఈ సంగతి నిజమేనని నాకుతెలుసు.

"నా స్నేహితుల్ని ఎన్నో సందర్భాలలో ఆదుకున్నాను. కాని ఒక్క చిన్న సహాయంకూడా ఎవరివల్లా నాకు లభించలేదు. నా భార్య పోయినప్పుడు నేను యిదివరలో ఎంతో రిస్కు తీసుకుని సాయపడిన వాళ్ళని అడిగినప్పుడు ఏవో సాకులు చెప్పి తప్పించుకున్నారు."



శ్రీపతి అంత ఆర్థిక యిబ్బంది పడినట్లు నాకు తెలీదు.

"నిన్నడిగితే సాయంచేసే వాడివే. కాని నావల్ల ఉపకారం పొందినవాళ్ళని విడిచిపెట్టి నిన్నడగటం యిష్టంలేకపోయింది. అసలు చిన్నప్పట్నుంచీ అంతే. ఎవ రేది అడిగినా నా స్వంత పనులు మానుకునే యితరులకు చేసిపెడుతూ వుండేవాడ్ని. నా వరకూవచ్చేసరికి చిన్న సహాయం కూడా ఎవరి నుంచీ నాకు లభించేది కాదు.

'ఒకటి కాదు...రెండు కాదు ఎన్నో దృష్టాంతాలు నా దగ్గర వున్నాయి.'

అతని ముఖంలో చాలా ద్వేషం, ఆవేశం కనిపిస్తున్నాయి.

"అందుకే యీ కుక్కపిల్లంటే చాలా అభిమానం ఏర్పడుతోంది. ఇంకా సంగతి చిత్రంగా వుంటుంది. మనుష్యుల్లో నూటికి ఒకరు మంచివాళ్లుంటే వుండవచ్చు. కాని కుక్కలలో కోటికి ఒకటి కూడా చెడ్డది వుండదు."

అతని అభిప్రాయాలు అతనికి వుండవచ్చుగాని, యిలాంటి సంభాషణ మా మధ్య నడవటం చాలా చికాకుగా వుంది.

ఎలాగో మాట తప్పించటానికి ప్రయత్నం చేశాను.

* * *

తర్వాతసారి కలుసుకున్నప్పుడు కొంత సంతోషంగా, ఉత్సాహంగా కనిపించాడు.

"నీకో మంచి కబురు."

ఏమి టన్నాను.

"పెళ్ళి చేసుకోబోతున్నాను."

"గుడ్. ఎవరా అమ్మాయి?"

"చెబుతాను. నా జీవితంలో నీ ముందు ఇంతవరకూ దాచిన రహస్యం యిది. ఆ అమ్మాయి పేరు లత. చాలా బీదపిల్ల. ఒకానొక సందర్భంలో ఆమె తండ్రికి చాలా సాయం చేశాను. అప్పట్నుంచీ మాకు పరిచయం. ఎన్నోసార్లు కలుసుకునే వాడ్ని. ఆమె యింట్లో ఎన్నో గంటలు గడిపాను. అప్పుడప్పుడూ అక్కడే భోంచేసేవాడ్ని."

అతని జీవితంలో రసవత్తరమైన ఓ రహస్యం వున్నందుకు మనసారా అభినందించాను.

"పెళ్లెప్పుడు?"

"నేను నిర్ణయించినప్పుడు. బహుశా వచ్చే నెలలో చేసుకుంటాను."

లత విషయంలో అతని వ్యక్తిత్వం ఆత్మ విశ్వాసం నన్ను సంభ్రమపరిచాయి.

* * *

నెల రోజులు గడిచాక - బహుశా పెళ్ళిచేసుకుని వుంటాడనీ, లేక ఆ ప్రయత్నంలో వుండివుంటాడనీ అను

కుంటూ అతని గుమ్మంలో కాలు పెట్టాను.

హాల్లో చాపమీద పడుకుని వున్నాడు. మునపటి కన్నా చిక్కిపోయి వున్నాడు. గడ్డం బాగా పెరిగిపోయింది.

వైటీమీద ఎంత మమకారం ప్రదర్శిస్తున్నా, యిన్నాళ్ళూ దానితో సన్నిహితంగా వుండటంచూడలేదు. ఇప్పుడు అతనిపక్కగ యించుమించు—వొడిలో వున్నట్లు పడుకుని వుంది. అతని వ్రేళ్ళు దాని శరీరం నిమిరుతున్నాయి. వైటీ కూడా చిక్కిపోయివుంది.

నన్నుచూసి మౌనంగా తల ఉపాడు లేవలేదు. కుర్చీలో కూర్చోమన్నట్లు సంజ్ఞచేశాడు.

"ఏమిటి వాలకం ?" అనడిగేశాను.

"మనుషుల దుశ్చర్య"

"అంటే?"

"ఆఖరికి లత దగ్గర్నుంచి కూడా నేనేమీ-అంటే—నేననుకున్నది పొందలేకపోయాను."

''వివరంగా చెప్పు.''

''ఆమె నన్ను నిరాకరించింది."

"ఎందుకని"

"లత మనిషి''

''అది సరే. ఏం జరిగింది ?''

''లత మనిషి. అంతకంటే నేనేం చెప్పలేను?"

నిజంగా ఎంత ప్రయత్నించినా, అతన్తో అంతకంటే యింకేం చెప్పించలేకపోయాను.

* * *

అతి కష్టంమీద లత ఎడ్రెస్ సంపాదించి ఆమెను కలుసుకున్నాను.

అదో పూరి పాక. కాని శుభ్రంగా, ఏదో ప్రత్యేకత ఒలకబోస్తూ వున్నది.

నే వెళ్లేసరికి ఆమె ఏదో పుస్తకం చదువుకుంటూ కనిపించింది.

"మీరేనా లత?" అని నేను పలకరించినప్పుడు వినయంగా నమస్కరించి, 'రండి' అని సాదరంగా ఆహ్వానించింది.

ఆమెకి యిరవయ్యేళ్ళు వుంటాయి. పేదరికంలో — యిలాంటి వాతావరణంలో వుండే అందాన్ని గమనించగల సహృదయత వుంటే— యీ పేదపిల్ల అందగత్తె.

చిన్న స్టూలేసింది. కూర్చున్నాను.

''నేను శ్రీపతి స్నేహితుడ్ని" అని చెప్పుకుని ఒకటి రెండు నిమిషాలు సందిగ్ధంగా గడిచాక సంకోచాన్ని పారద్రోలి "మీరు శ్రీపతి నెందుకు నిరాకరించారు ?" అనడిగాను.

ఆమె నా ముఖంలోకి ధైర్యంగా చూసింది. ఆమె పెద్దపెద్ద కనులలో—నాకు ఎంతో లోతు, ఆత్మవిశ్వాసం గోచరించాయి.

"శ్రీపతిగారు మా కుటుంబం కష్టాలలో వున్నప్పుడు ఆదుకున్న మాట నిజమే. అలాంటి సహాయం అప్పట్లో లభించకపోయినట్లయితే మేము వీధిన పడివుండేవాళ్ళం. ముఖ్యంగా — నేనే మయిపోయి వుండేదాన్నో—''

క్షణంపాటు ఆమెముఖంలో భయం కనిపించింది.'

"తర్వాత ఆయన నాతో ఎంతో చనువుగావుంటూ వచ్చారు. ఆయన మాకు చేసిన ఉపకారం దృష్ట్యా—నేను అభిమానిస్తూ వుండేదాన్ని, నేను కేవలం ఆయన్ని ఉదాత్తుడిగానే అర్థంచేసుకుని వుంటే నా జీవితం ఆయన పాదాల ముందుపరిచివుండేదాన్ని... కాని యిటివలే మాటల్లో ఓ సత్యం తెలిసి నా మనస్సు వికలమైపోయింది. భార్య మరణాన్ని గురించి ఆయన ముందుగా ఊహిస్తూవుండేవారు. భార్యచనిపోయాక నన్ను పెళ్ళిచేసుకోవాలని ఒకసారి హఠాత్తుగా వెల్లడిచేశారు. అప్పుడాయన ముఖంలోకి చూస్తే, ఆ ఆత్రుతలో...ఆ కోరికలో, ఆ వేడి నురగలవంటి కళ్ళ కదలికలో భార్యచావు గురించి తొందర పడుతున్నాడా, నిరీక్షిస్తున్నాడా అనిపించింది. అప్పట్నించీ అసహ్యమేసింది ఆయన్ని క్షమించలేక పోయాను. అలాంటి వ్యక్తిని జీవితమంతా భరించ లేననిపించింది. అందుకే-నిరాకరించాను.

ఆమె వ్యక్తిత్వం పలికే ప్రతి అక్షరంలో, ప్రతికదలికలో తెలుస్తోంది. ఆ నిర్ణయానికి తిరుగులేదని అర్థమైంది. సెలవు తీసుకున్నాను.

* * *

ఇప్పుడు మనుషులంతా అతని శత్రువులు.

ఆఫీసు, యిల్లు, వైటీ.

ఆ వైటీలో తనకు ప్రపంచం యివ్వనిది, ప్రపంచం నుంచి పొందలేనిది దొరుకుతున్నట్లు... అనుభూతి చెందుతున్నాడా?

మనిషంటే భయపడిపోతున్నాడు

వైటీ అంటే పడి చచ్చిపోతున్నాడు.

నాకు అతని దగ్గరకు వెళ్ళాలంటే భయమేస్తుంది. ఒకప్పుడు తీవ్రంగా అసహ్యించుకున్న జాతి — ఆ జాతికి ప్రతినిధిని కావలించుకుంటూ, కబుర్లు చెబుతూ, కన్నీళ్ళు కారుస్తూ...

ఇద్దరూ ఎప్పుడు తింటారో తెలీదు. అసలు తింటారో లేదో తెలియదు.

మనుషుల్లో యింత మార్పు ఎలా వస్తుందో నా కాశ్చర్యం. కాని యీ నిజానికి వెనకవున్న సత్యాలంటే భయం.

జీవితంలో చాలా కోల్పోవచ్చుగాని పరాకాష్ఠనందుకున్న విరక్తిని చూస్తే నా శరీరం జలదరిస్తుంది.

* * *

వైటీకి పిచ్చెక్కింది.

అది రోడ్లమీద పరిగెత్తుతూంటే, కుర్రాళ్ళంతా దాన్ని చంపటానికి కర్రలతో వెంట తరుముతూంటే "కొట్టకండి! చంపకండి, దాన్నేంచేయకండి" అని శ్రీపతి చిరిగిపోయిన గుడ్డలతో వీధులలో వాళ్ళ వెనకపరిగెత్తేదృశ్యాన్ని జీవితంలో మరిచిపోలేను.